# నేను నేనే-5

| Index | Page no |
|---|---|


| | |
|---|---|
| 78.నీవే | 2 |
| 79. ఋషిపీఠం | 4 |
| 80. అది-ఇది | 4 |
| 81. బంధం-ప్రేమ | 7 |
| 82. వినడం-అనడం | 9 |
| 83. అఖండానుభవం | 11 |
| 84. ప్రత్యేకత | 14 |
| 85. లీల-గోల | 15 |
| 86. సత్సంగం | 19 |
| 87. అబద్ధం-నిజం | 21 |
| 88. సాధన-ఉపాసన | 25 |
| 89. చచ్చిపోవడం అంటే వచ్చిపోవడమే | 29 |
| 90. స్థితప్రజ్ఞత-ప్రత్యేకత | 31 |
| 91. ప్రేమ | 33 |

## 78. **నీవే**

ఎవరూ లేరు...

నీవు మాత్రమే ఉన్నావు...

నీతో పాటే సకలమూ వచ్చింది...

నీతో పాటే సకలమూ పోతుంది...

ఉన్నట్టు కనిపించే లేనిది ప్రపంచం...

లేనట్టు అనిపించే ఉన్నది బ్రహ్మము...

నీవే బ్రహ్మము...

'నీవు' మాత్రమే సత్యము...

'నీవు' తప్ప యావత్తూ స్వప్నము...

ఈ స్వప్న పరంపరే జన్మ పరంపర...

దశావతారములు కూడా స్వప్న పరంపరలే...

జాగ్రత్-స్వప్న-సుషుప్తులు మూడూ...

నీలో కదలాడే నీడలే...

ఇచ్ఛాపూర్వకంగానే  ఈ కలకంటున్నావు...

ఇచ్ఛాపూర్వకంగానే మేలుకుంటావు...

నీవు చూస్తేనే సకలమూ ఉంటుంది...

నీవు చూడకుంటే సకలమూ శూన్యమే...

ఏకత్వం ఉండబట్టే వ్యవహారం ఉంటుంది...

ఏకత్వం శిథిలమైతే వ్యవహారం శూన్యం.

ఉద్ధరేదాత్మనాత్మానం...

నిన్ను నీవే పతనం చేసుకున్నావు...

నిన్ను నీవే ఉద్ధరించుకోవాలి...

నీకు నీవే శత్రువు...

నీకు నీవే బంధువు...

నీవు అనంతుడవు...

అనంతమే తానని తెలుసుకున్నప్పుడు...

నిజమైన స్వాతంత్ర్యం(ముక్తి) లభించేది...

అనంతమైనదానికి ఎవరు సహాయపడగలరు?

సహాయం చేయడానికి...

నీ దగ్గరకు వచ్చే చేయి కూడా నీదే కావాలి...

నీవు మాత్రమే ఉన్నావు...

సకల నామరూపాలూ నీవే...

సకలశక్తులూ నీవే...

పరబ్రహ్మమూ నీవే...

మహామాయా నీవే...

ఉన్నది-ఉన్నట్లున్నది-లేకున్నది...

మూడు స్థితుల్లోనూ "ఉన్నది" నీవే...

అని గుర్తుకు తెచ్చే గురువూ నీవే...

శబ్దముల మధ్య ఉన్న నిశ్శబ్దం నీవు...

చలనముల మధ్య ఉన్న అచలం నీవు...

సమూహముల మధ్య ఉన్న ఏకాంతం నీవు...

రాజ్యం లేని రాజువి నీవు...

ప్రపంచం లేని దేవుడివి నీవు...

జననమరణములు లేని చిదాకాశరూపుడవు నీవు...

బంధమోక్షములు లేని కేవలుడవు నీవు...

******************************

## 79. ఋషిపీఠం

సృష్టిలో అనేకత్వం వ్యవహారంలో సహజం.

పరమార్ధ దృష్టితో ఏకత్వాన్ని

దర్శించగలిగితే, విభిన్నతలను చక్కగా

సమన్వయించుకోగలం.

ఆ దృష్టినిచ్చిన శివగురువులు శంకరులకు

ప్రణామములు సమర్పించుకుంటున్న.

***************************

## 80. అది-ఇది

కనుచూపు పారినంతమేరకు ఉన్నదే ప్రపంచం... అన్నారు సద్గురుదేవులవారు...

ఇక ఆవల ఉన్నదంతా...

అనగా నీకు అనుభవంలో లేనిదంతా దైవమే...

"అది-ఇది" ఒకే వస్తువు...

అనుభవంలోకి రాని భాగాన్ని "అది" అన్నారు...

అనుభవంలోకి వచ్చినభాగాన్ని "ఇది" అన్నారు...

"అది" అంటే దైవము.

"ఇది" అంటే ప్రపంచము.

"అది" అంటే గాఢనిద్ర...

"ఇది" అంటే మెలకువ...

నీకు తెలిసిందంతా...

నీకు తెలియనిదాని యొక్క వ్యక్తరూపమే...

గాఢనిద్రలో బీజరూపంగా ఉంటుంది...

మెలకువలో ప్రపంచంగా విస్తరిల్లుతుంది...

కనుచూపుకు ఆవల ఉంటుంది దైవం...

కనుచూపుకు ఈవల ఉంటుంది దైవం...

ఆవలకు ప్రయాణించేవాడు - సైంటిస్టు.

ఈవలకు ప్రయాణించేవాడు - యోగి.

ప్రపంచం అనంతం అంటే...

దైవం కూడా అంత దూరమైపోతాడు...

ప్రపంచం కనుచూపు పారినంతమేరకే అంటే...

దైవం కాస్త నీకు దగ్గరవుతాడు...

గదిలో కూర్చొని ఉంటే...

గదికి ఆవల నుంచి ఉంటుంది దైవం...

కనులు  మూసుకుంటే...

కనురెప్పల నుంచి ఉంటుంది దైవం...

అనగా-

నీకు కనబడేదంతా ప్రపంచం...

నీకు కనబడనిదంతా దైవం...

కాబట్టి "దైవదర్శనం" అనే మాట పొసగదు...

నీవు దర్శించేదంతా ప్రపంచాన్నే...

దర్శనం చేయాలంటే...

దర్శించేవాడు-దర్శింపబడేది అని రెండు ఉండాలి...

"రెండు" ఉండడమే ప్రపంచలక్షణం...

"రెండు" తోచకుండడమే సాక్షాత్కారం...

రమణులను ఒకరు అడిగారు...

దేవుడు కనబడితే ఏం కోరుతారు? అని.

"ఇక కనపడవద్దు" అని కోరుతాను...అన్నారు.

కనబడేది(object) దైవం కాదు...

కనేవాడు(subject) దైవం...

అన్న గురుదేవులవారి ఉపదేశాన్ని స్మరించుకుందాం...

ద్రష్ట(subject) - దైవం.

దృశ్యం(object) - ప్రపంచం.

"దృష్టే దృశ్యంగా ఉండేది..."

అనే అనుభవం కలగడమే సాక్షాత్కారం...

ద్రష్టకు విడిగా దృశ్యానికి ఉనికి లేదు...

కానీ నీవు విడిగా అనుభవిస్తున్నంతకాలం...

ఈ దృశ్యం నిన్ను బాధిస్తూనే ఉంటుంది...

ద్రష్టలో సంస్థితమై...

ద్రష్టగా ఉండటానికి చేసే ప్రయత్నమే...

ఈ ఆధ్యాత్మిక సాధనలన్నీ...

దేవుడు కనబడ్డాడు అంటే దుఃఖించండి...

దేవుడు దృశ్యంగా(object) మారిపోయినందుకు...

దేవుడు కనబడలేదు అంటే సంతోషించండి...

దేవుడు స్వరూపంగా(subject) ఉన్నందుకు...

************************************

## 81. బంధం-ప్రేమ

ఇతరులు తనను గుర్తించలేదని

వాపోతున్నామంటే...

దాని నిజమైన అర్థం ఏమంటే-

తనను తానే గుర్తించలేదని అర్థం.

* * *

ఇతరులు తనను ప్రేమించలేదని

వాపోతున్నామంటే....

దాని నిజమైన  అర్థం ఏమంటే-

తనను తానే ప్రేమించడం లేదని అర్థం.

* * *

ఒకర్ని ప్రేమించడం చిన్న బలహీనత....

ఒకరి చేత ప్రేమింపబడాలనుకోవడం పెద్ద బలహీనత...

* * *

నిన్నెవరైనా పట్టించుకుంటూ వుంటే సంతోషించు....

నిన్నెవరూ పట్టించుకోకపోతే ఎక్కువ సంతోషించు...

* * *

ఫలానాది లేకపోతే నేనుండలేను....

ఫలానావారు లేకపోతే నేనుండలేను...

ఇవన్నీ బలహీనత లక్షణాలు....

ఏదీ...ఎవరూ లేకపోయినా తానుంటాడు...

తానెప్పుడూ ఒంటరియే...

ఆ విషయం తెలియజేయడం కోసమే...

నీ ప్రియమైన వారిని...

నీ ప్రియమైనవాటిని...

దూరం చేస్తాడు భగవంతుడు...

ప్రేమించు....

ఆ ప్రేమ బంధం లేని ప్రేమగా ఉండాలి...

బంధం లేని వ్యవహారం కలిగి ఉంటే...

నిన్ను ఎవడూ ఏమీ పీకలేడు...

దేవుడు కూడా...

యోగః కర్మసుకౌశలం...అంటే ఇదే.

******************************

**82. వినడం-అనడం**

సముద్రతీరానికి నడచివెళుతుంటే...

ముందుగా సముద్రపుహోరు వినిపిస్తుంది....

తర్వాతే సముద్రదర్శనం అవుతుంది...

అటువంటి హోరు 'పరమపదం' అనేది...

హోరు వినిపిస్తోందంటే...

సముద్రానికి దగ్గరైనావు అని అర్థం...

పరమపదాన్ని వినడమంటే...

పరమాత్మునికి దగ్గరైనావు అని అర్థము...

అందుకే దానిని వింటూ ఉండమని చెప్పేది...

వినేది ఏదయినా అది అపౌరుషేయమే...

నీ నోటి నుంచి వచ్చే మాటను కూడా...

నీవు వింటున్నావు...

కాబట్టి నీ మాట కూడా అపౌరుషేయమే...

వేదగానం నుంచి...

సృష్టిలోని ప్రతి చప్పుడూ అపౌరుషేయమే...

ఆ హోరుకు(పరమపదానికి) కర్త

సముద్రమే(దైవమే).

ఆ హోరు నాది అనడానికి ఎవరికీ అధికారం లేదు.

పరమపదాన్ని వినేవాళ్లు అనేకులుంటారు...

అనేవాడు ఒకడే ఉంటాడు...

వాడే పరమాత్ముడు...

పరమపదాన్ని వింటూ వున్నావంటే...

నీవు పరమాత్మునికి దగ్గరగా ఉన్నావని అర్థం...

పరమపదాన్ని అంటూ వున్నావంటే...

నీవే పరమాత్ముడుగా ఉన్నావని అర్థం...

వింటున్నామా? అంటున్నామా? అనేది...

యెవరికి వారు ప్రమాణం...

పరమపదాన్ని -

వినడం వినడమేగాని...

అనడం మాత్రం అనడం కాదు...

అనడం అంటే ఉండడం...

ఆ ఉండటాన్ని అనటంగా చెప్పుకుంటున్నాం...

అంతే.

**********************************

## 83. అఖండానుభవం

ఏది అభేదంగా...

అఖండంగా...

అద్వైతంగా...

ఉన్నదో...

అదియే నిజమైన నిద్ర...

అదియే నిజమైన మెలకువ...

అదియే నిజమైన కల...

* * *

అది తెలియబడడానికిగాని...

అది తెలుసుకోవడానికిగాని...

అన్యం లేని ఏకాత్మ వస్తువది...

కదలడానికి అవకాశం లేని చైతన్యం అది...

మాట్లాడడానికి అవకాశం లేని మౌనం అది...

చూడడానికి అవకాశం లేని తుదిలేని కన్ను అది...

* * *

ఆ నిద్ర, మన నిద్ర లాంటిది కాదు...

ఆ మెలకువ, మన మెలకువ లాంటిది కాదు...

ఆ కల, మన కల లాంటిది కాదు...

ఆ నిద్ర చైతన్యం...

ఆ మెలకువ ప్రజ్ఞావంతం...

ఆ కల లీలామాత్రం...

* * *

మన నిద్ర జడం...

మన మెలకువ వివశత్వం...

మన కల అజ్ఞానం...

* * *

ఈ నిద్ర-మెలకువ-కలలకు...

from అడ్రస్సు ఉంటుంది...

ఆ నిద్ర-మెలకువ-కలలకు...

from అడ్రసు ఉండదు...

ఆ మెలకువ, స్వయంమెలకువ.

ఆ నిద్ర, స్వయం నిద్ర.

ఆ కల, స్వయం కల.

ఆ నిద్ర-మెలకువ-కలలు ఎవరివీ కావు..

అది అఖండమైనది...

కావున ఆ అఖండంలో నిద్ర-మెలకువ-కలలు

ఏకకాలంలో ఉన్నాయి...

నది నదిగా ఉంటూనే...

నదికి పుట్టుక-ప్రవాహం-సాగరసంగమం ఉన్నట్టు...

అఖండం అఖండంగా ఉంటూనే...

అఖండంలో సృష్టి-స్థితి-లయాలు ఏకకాలంలో ఉంటాయి...

స్థితి - మెలకువ.

సృష్టి - కల.

లయం - నిద్ర.

అది యెప్పుడూ ఖండం కాలేదు...కాదు...

ఆ అఖండం నీకు అనుభవంలోకి రావాలంటే...

అది ఖండం అయితేనే సాధ్యం...

అది ఖండం కావడం అసంభవం...

కాబట్టి నీకు అఖండానుభవం కలగడం అసాధ్యం...

అనే తెలివి కలగడం ఒక్కటే జ్ఞానం.

అనుష్ఠానం...

అనుభవం...

స్వానుభవం...

లాంటి పదాలను వదిలి...

సద్గురు సన్నిధిలో అవగాహన పొందటమే...

మన తక్షణకర్తవ్యం...

****************************

## 84. ప్రత్యేకత

నమస్కారం...ఒక సందేహం...

ఈమధ్య నాలో జరిగిన మార్పు ఏమంటే...

ఎటువంటి సందేహమూ కలగడంలేదు...

పూజ చెయ్యాలి అనిపించటంలేదు...

దేని మీదా భయము లేదు...

దేని మీదా ప్రత్యేకత లేదు...

ఏదీ కావాలి అనీ లేదు...

నేనుగాని ఏమైనా మొద్దు బారిపోయనా?

అలా అని బాధ దుఃఖము ఇవి కూడా లేవు...

ఇంకేదో చదవాలి...

ఇంకేదో తెలుసుకోవాలి... అని కూడా లేదు...

తమోగుణంలో కూరుకుపోతున్నానా?

దయచేసి మీ సమాధానం...

అడిగాడు శిష్యుడు...

* * *

మీరు స్వస్థితిని పొందారు...

మీరు స్వరూపాన్నే వర్ణించారు...

సందేహం లేదు...

సాత్వికం-తామసం రెండూ ఒక్కలాగే కనిపిస్తాయి...

వైరాగ్యం, సోమరితనం ఒక్కలాగే కనిపిస్తాయి...

నిద్ర, సమాధి ఒక్కలాగే కనిపిస్తాయి...

అచలం, జడం ఒక్కలాగే కనిపిస్తాయి....

దేని యెడలా "ప్రత్యేకత" లేకపోవడం...

అనే ఒక్క లక్షణం చాలు...

నీవు జ్ఞాననిష్ఠలో ఉన్నావు అనడానికి...

******************************

## 85. లీల-గోల

రాతిలో శిల్పం చెక్కక మునుపే...

ఆ రాతిలో శిల్పాన్ని దర్శిస్తాడు శిల్పి...

అందుకే ఆ భాగం వరకు వదిలి...

మిగతా రాతిని ఉలితో తొలగిస్తాడు...

* * *

కాన్వాస్ పై చిత్రాన్ని గీయకమునుపే...

కాన్వాస్ పై చిత్రాన్ని దర్శిస్తాడు చిత్రకారుడు...

అందుకే తనకు మాత్రమే కనబడే ఆ గీతలపై...

తన కుంచెను కదిలిస్తాడు...

* * *

షూటింగ్ మొదలుపెట్టక మునుపే...

మొత్తం సినిమాను దర్శిస్తాడు దర్శకుడు...

అందుకే చక్కగా చిత్రీకరిస్తాడు చిత్రాన్ని...

* * *

సృష్టి జరగక మునుపే...

జగత్కథను దర్శిస్తాడు పరమాత్ముడు...

అందుకే సృష్టివిషయంలో...

ఏ అయోమయానికీ గురికాక...

జగన్నాటకాన్ని జరిపిస్తాడు పరమేశ్వరుడు...

* * *

అందుకే ఆయనకు "అచలుడు" అని పేరు...

ఆయన దేనికీ చలించడు...

సినిమా తీయక మునుపే...

సినిమా చూసేసినవాడు కనుక...

తానే script తయారుచేశాడు కనుక...

ఆ స్క్రిప్టే భగవదిచ్ఛ...

అదే విధిరాత...

అదే తలరాత...

ఆయన తలలో నుంచి...

ఈ జగత్భావన పుట్టింది కాబట్టి...

తలరాత అయ్యింది...

మన తల పేరు తలంపు...

ఆయన తల పేరు లీల...

అందుకే లోకవత్ లీలా కైవల్యం...

అంటుంది బ్రహ్మసూత్రం...

ఆయన తలలో నుండి వచ్చేది లీల...

మన తలలో నుండి వచ్చేది గోల...

* * *

ఈ జగత్తును-

(దేవుని)లీలగా...కలగా...గుర్తించినవారు...

'ఎందుకు?' అని ప్రశ్నించనివారు...

జ్ఞానులు.

* * *

ఈ జగత్తును-

నిజమని భ్రమిసేవారు...

సుఖదుఃఖాలను అనుభవించేవారు...

'ఎందుకు?' అని ప్రశ్నించేవారు...

అజ్ఞానులు.

* * *

పరమేశ్వరుని చేతిలో నేనొక పరికరం...

పరికరం యొక్క ప్రయోజనం...

అనగా జీవితం యొక్క ప్రయోజనం పరికరానిది కాదు...

ఆ పరికరాన్ని ఉపయోగించేవానిది...

అని ఉదాసీనంగా ఉండేవారు జ్ఞానులు...

* * *

'నా శరీరం' అనుకునే శరీరం నాది కాదు...

'నా జీవితం' అనుకునే జీవితం నాది కాదు...

ఇది భగవంతుని శరీరం...

ఇది భగవంతుని జీవితం...

ఇది భగవంతుని నాటకం...

అని స్థిమితంగా ఉండేవారు స్థితప్రజ్ఞులు...

* * *

భగవంతుని 'అహంప్రకాశ' స్పర్శ వలన...

ఈ జడమైన దేహానికి చైతన్యం కలిగి...

నేను-నాది అనుకునే తెలివి కలుగుతోంది...

'ఇది నా శరీరం' అనుకుంటే, ఇది జడమే...

'ఇది దేవుని పరికరం' అనుకుంటే, ఇది చైతన్యమే...

ఆట పూర్తయ్యాక తోలుబొమ్మలను పెట్టెలోకి త్రోసివేసినట్టు...

మన ఆట పూర్తయ్యాక కూడా...

ఈ శరీరం మృత్యువులోకి త్రోయబడుతుంది...

ఓ జ్ఞానాంబ దయామయీ...!

అప్పటివరకు నీ జ్ఞాపకం నా వ్యాపకం...

*********************************

## 86. సత్సంగం

నమస్కారం స్వామీ...

మా సత్సంగం ఇప్పుడే ముగిసింది...

ఆత్మ ఎవరిని వరిస్తుంది?

ఎవరికి నిరాశను మిగులుస్తుంది?

అడిగాడు శిష్యుడు...

* * *

మనలో ఆత్మ ఉండడం కాదు...

ఆత్మలో మనమందరమూ ఉన్నాము...

సముద్రంలో జలచరాల్లాగా...

ఉన్న సకలమూ ఆత్మలోనే ఉంది...

మనం సత్సంగం చేసుకోవడం ఎలాంటిదంటే...

సముద్రాన్ని చేరుకోవాలంటే...

ఏ మార్గమైతే బాగుండును...?

అని సముద్రంలోని చేపలు కొన్ని...

సత్సంగం చేసుకున్నాయట...

కర్మ మార్గం మంచిదని ఒక చేప...

భక్తిమార్గం గొప్పదని ఒక చేప...

జ్ఞానమార్గం అంతిమమని ఒక చేప...

అలా రకరకాల మార్గాలతో...మాటలతో...

"సత్సంగం" పేరుతో కాలక్షేపం చేసుకున్నాయి...

వాటి పుట్టుక, జీవితం, మరణం...

అన్నీ సముద్రంలోనే...

అలా మనమందరం ఆత్మను చేరుకోవడానికి...

ఎంచుకునే మార్గాలు కూడా అలాంటివే...

మన జననం, జీవితం, మరణం అంతా ఆత్మలోనే...

ఆత్మ ఎవరినీ వరించదు...

ఎవరినీ నిరాశ పరచదు...

నిరాశ పరిచేది నీ Expectation...

నీ గురించిగానీ...

ప్రపంచం గురించిగానీ...

దైవం గురించిగానీ...

expect చేయడం మానుకో...

గతాన్ని స్మరించకు...

భవిష్యత్తును ఊహించకు...

వర్తమానాన్ని సాధన పేరుతో పాడుచేసుకోకు...

పక్షి గింజ...గింజ ఏరుకుని తిన్నట్టు...

నీవు క్షణం...క్షణం జీవితాన్ని అలా అనుభవించు...

వదలాల్సింది దెయ్యమే కాదు...

దేవుడు కూడా వదలాలి...

అప్పుడే మనకు ముక్తి...

దేవుణ్ణి వదిలించే మహామాంత్రికుడే సద్గురువు...

****************************

## 87. అబద్ధం-నిజం

మార్పు లేనిది ఎలాగూ మారదు...

నువ్వేం చేసినా...

మారేది మారుతూనే ఉంటుంది...

నీ ప్రమేయం లేకుండా...

దానిని కదపలేం...

దీనిని ఆపలేం...

నీవు కదలడం లేదు...

"ఏదో" కదిలిస్తే కదులుతున్నావు...

నీవు పలకడం లేదు...

"ఏదో" పలికితే నీవు పలుకుతున్నావు...

నీవు తలవడం లేదు...

"ఏదో" తలిస్తే నీవు తలుస్తున్నావు...

నా జ్ఞానం అనుకునేది నీది కాదు...

నా జీవితం అనుకునేది నీది కాదు...

"నేను" అనుకునే నీవు నీవు కాదు...

ఇలా అనుకునే జ్ఞానం కూడా నీది కాదు...

అసలు నీదంటూ ఏమీలేదు...

నా శరీరం అంటావు...

శరీరం లోపల ఏం జరుగుతోందో నీకు తెలియదు...

నా మనసు అంటావు...

మనసంటే ఏంటో ఎప్పటికీ తెలుసుకోలేవు...

ఎవడికీ అర్థమైంది ఏమీలేదు...

అర్థమైంది...అనుకునేవాళ్లంతా...

అర్థంకాలేదని...అర్థమైనవాళ్లే...

అర్థమైంది అనుకుంటే అదే అనర్థం...

అర్థంకాలేదని అర్థమైతే అదే జ్ఞానం...

శరీరమొక మిథ్య...

మనసొక మిథ్య...

జగత్తొక మిథ్య...

నీవు పెట్టుకున్న పేర్లు వల్లనే ఈ విభజన అంతా...

పేర్లు తీసేయ్...

"పేరు" అనేది కూడా పేరే...

దానిని కూడా తీసేయ్...

ఆకాశంలో కాసేపు ఉండి మాయమయ్యే...

మేఘాల ఆకారాల వలె...

రూపాలన్నీ మెలమెల్లగా ఏకత్వంలో కలిసిపోవడం చూస్తావు...

నీకు బంధమే లేదు...

యెందుకంటే అసలు నీవు లేనేలేవు...

అందుకే నీకు మోక్షం కూడా లేదు...

ఇదే మోక్షసన్న్యాసయోగం...

శూన్యాన్ని ఎవడు బంధించగలడు?

శూన్యాన్ని ఎవడు విడిపించగలడు?

ఆకాశపుష్పాన్ని ఎవడు ఆఘ్రాణించగలడు?

గొడ్రాలిపుత్రుణ్ణి ఎవడు దత్తుకు తీసుకోగలడు?

యెండమావుల్లో ఎవడు దాహం తీర్చుకోగలడు?

లేనిది ఎటూ ఉండదు...

ఉన్నది ఎటూ ఉంటుంది...

లేనిది శూన్యవస్తువు...

ఉన్నది అనంతవస్తువు...

అదీ బంధించదు...ఉనికి లేక...

ఇదీ బంధించదు...అన్యం లేక...

ఇక బంధమోక్షాలకు ఉనికి ఎక్కడిది?

అనే జ్ఞానమే మోక్షసన్యాస యోగం...

దేని మీద నిలబడి...

సత్యాసత్యవిచారణ చేస్తున్నావో...

ధర్మాధర్మవివేచన చేస్తున్నావో...

ఆ స్థానమే అబద్ధం...

ఆ స్థానమే అధర్మం...

దొంగతనం చేయరాదు....

అనే వాక్యాన్ని వ్రాసింది...

దొంగిలించిన కలంతోనే...

దొంగిలించిన పుస్తకంలోనే...

వాక్యం వ్రాసినవాడే దొంగ...

సత్యాన్ని ప్రకటించేవాడే అసత్యం...

ఇక వానిచే ప్రకటింపబడిన సత్యాలు...

సత్యాలెలా అవుతాయి...

అంతా అబద్ధమే...

అని చెప్పే నిజం కూడా అబద్ధమే...

అంతా నిజమే...

అని చెప్పే నిజం కూడా అబద్ధమే...

ఇంతకీ మమ్మల్ని ఏంచేయమంటావు?

అని అడిగేవాడూ అబద్ధమే...

ఫలానా సాధన చేయి...

అని బోధించేవాడూ అబద్ధమే...

సాధనా అబద్ధమే...

సిద్ధీ అబద్ధమే...

నిజం ఒకటే ఒకటి ఉంది...

అదే - "ఒకటి"

అదే - దైవం.

అదే - నిశ్శబ్దం.

అదే - "నేను".

**************************

## 88. సాధన-ఉపాసన

భక్తుడుగా ఉన్నాడు అంటే...

భగవదానుభవం లేదనే అర్థం...

భగవదానుభవం కలిగినవాడు...

భక్తుడుగా ఉండలేడు...

మరి అతడు ఏమిగా ఉంటాడు?

భగవంతుడుగానే ఉంటాడు...

నిరుద్యోగికి ఉద్యోగం వచ్చిన తరువాత

ఉద్యోగిగా ఉంటాడుగానీ...

తరువాత కూడా అతనికి నిరుద్యోగి అనే పేరు ఎలా ఉండగలదు?

* * *

భగవదానుభవం అంటే...

తానే భగవంతుడు అయిపోవడం...

సముద్రంలో కలిసిన నదికి ప్రవాహం ఉండదు...

దైవంలో కలిసిన వ్యక్తికి కర్తవ్యం ఉండదు...

నాకు భగవంతుణ్ణి చూపించగలరా?

అని ఒకడు భగవాన్ను అడిగితే...

భగవంతుణ్ణి చూపలేనుగానీ...

నిన్నే భగవంతుణ్ణి చేయగలను అన్నారు...

ధ్యానంలో-

అది చూశాను...ఇది చూశాను...అంటే

తప్పులో కాలువేసినట్టే...

అది ధ్యానమూ కాదు...

అది దర్శనమూ కాదు...

ద్రష్ట లేక దర్శనం సున్న...

చూడబడేది ఎంత గొప్పదర్శనమైనా...

చూచేవాడు లేకుంటే చూడబడేది ఉండదు...

కాబట్టి చూచేవాడే గొప్ప...

చూచేవాడే భగవంతుడు...

చూచేవాడే అంతిమసత్యం...

* * *

అవగాహనే ధ్యానం...

అవగాహన లేని ధ్యానం ఓ విశ్రాంతి మాత్రమే...

దానితో తెల్లారేదేమీ ఉండదు...

ముందు కావలసింది ధ్యానం కాదు...

జ్ఞానం...

* * *

జ్ఞానం కూడిన కర్మ...

జ్ఞానంతో కూడిన భక్తి...

సఫలం అవుతాయి...

నహిజ్ఞానేన సదృశం పవిత్రమిహ విద్యతే...

జ్ఞానం కన్నా పవిత్రమైన వస్తువు మరొకటి లేదు...

* * *

ఈ జగత్ కలను చెదరిగొట్టే జ్ఞానమే...

నిజమైన ధ్యానం...

ఆ జ్ఞానం సద్గురు సన్నిధిలో మాత్రమే లభ్యం...

తరించడానికి "గురువు" అనే తెప్ప  అవసరం...

ఆ సద్గురు ప్రబోధించిన జ్ఞానాగ్నిలో...

శిష్యుడే కాదు...

గురువు కూడా భస్మం అయిపోవడం ఖాయం...

ఇదే ఏరు దాటగానే తెప్ప తగలెయ్యడం...

ఆ తరువాత శేషించే వస్తువే పరబ్రహ్మం...

అదే అహమహం...

* * *

మీ వ్యాసాల్లో సిద్ధుని వర్ణనే తప్ప...

సాధకునికి సూచనలు చేసినట్టు ఉండదేమి?

అని అడిగారొకరు.

* * *

నిజమే...

తాను స్వతఃగా సిద్ధుడే...

కారణమేదైతేనేమి?

తాను సిద్ధుడనేది మరిచాడు...

సిద్ధుని లక్షణాలను మననం చేసుకుంటూ వుంటే...

తానెవరో జ్ఞప్తికి వస్తుంది....

ఇదే ఉపాసన అంటే.

తాను కానిదానిని తాను పొందాలనే ప్రయత్నం - సాధన.

తానే అయినదానిని మననం చేయడం - ఉపాసన.

ఉపాసన లేక సిద్ధి కలుగదు...

అని రమణగీతలో రమణుడు స్పష్టంగా చెప్పడానికి కారణమిదే...

సిద్ధిని నెమరువేసుకోవడమే ఉపాసన...

"అహంబ్రహ్మాస్మి" అనుకోవడం...

"శివోహం" అనుకోవడం...

ఇవన్నీ ఉపాసనలే...

మనము ఉండవలసింది సాధకులుగా కాదు...

ఉపాసకులుగా...

మనకు కావలసింది దర్శనాలు కావు...

ద్రష్టత్వం...ఏకత్వం...

************************************

## 89. చచ్చిపోవడం అంటే వచ్చిపోవడమే

నమస్తే అండీ...

నా కుమారుడు ఆత్మహత్య చేసుకున్నాడు...

నాకు ధైర్యం ఉండే సందేశం ఇవ్వండీ....

* * *

అమ్మా....!

ప్రతీది భగవదిచ్ఛ ప్రకారమే జరుగుతోంది...

భగవదిచ్ఛ...

భగవదిచ్ఛ...

భగవదిచ్ఛ...

దీనిని మంత్రం లాగా జపించుకోండి కొంతకాలం...

* * *

నిజానికి మన స్వంతం అయింది ఏదీలేదు...

మన దేహం కూడా....

ఇది కూడా ఒకనాటికి పంచభూతాల్లోకి జారిపోతుంది...

అందరమూ కాస్త వెనక ముందు...అంతే.

ఒకడు విదియ రోజు పోతే...

మరొకడు తిదియరోజు పోతాడు...

అందరం ఏదో ఒక తిథిలో పోతాం...అంతే.

ఏడుపును ఆపవలసిన అవసరం లేదు...

కన్నీళ్లు ఖాళీ అయ్యేవరకు పూర్తిగా ఏడ్చేయండి...

free అయిపోండి...

ఇక తలుచుకోకండి...

ఇక బాధపడకండి...

మీరు బాధపడి, వాణ్ణి బాధపెట్టకండి....

మీ బిడ్డ భగవంతుని ఒడిలో సుఖంగా...

హాయిగా ఉన్నాడు...

వాడు సృష్టిరహస్యాన్ని కనుగొని...

మనవైపు...

మన అజ్ఞానం వైపు చూస్తూ...

చిరుమందహాసం చేస్తున్నాడు...

మనమెందుకు ఏడ్వడం...?

మనమూ హాయిగా ఉందాం...

జగన్నాటకంలో మనమూ కాసేపు పాల్గొని...

వెళ్లిపోదాం...

చచ్చిపోవడం అంటే...

వచ్చిపోవడమే...

ఎప్పటికైనా నాటకం(జీవితం) ముగుస్తుంది...

నాటకదీపం(ఆత్మ) మిగుల్తుంది...

* * *

మీ లాంటి వారితో సత్సంగం కావాలి...

* * *

ఇప్పుడు జరుగుతున్నదంతా సత్సంగమే...

సత్యంతో(నేనుతో) సంగం లేకుండా...

నీవూ ఉండవు...నేనూ ఉండను...

ప్రపంచమే ఉండదు..

**************************

## 90. స్థితప్రజ్ఞత-ప్రత్యేకత

స్వామీ...నమస్తే...

కవులకు ఈ ఆధ్యాత్మికంలో importance ఎంతవరకు ఉన్నది?

* * *

ఆధ్యాత్మికంలో ఎవరికీ...దేనికీ...

importance లేదు...

కవులకే కాదు... గురువుకు కూడా...దేవుడికి కూడా...

importance ఉంటే అది ఆధ్యాత్మికం కాదు...

ఈ ఆధ్యాత్మికంలో మనం నేర్వవలసింది...

నీతో సహా దేనికీ ఎవరికీ importance ఇవ్వకపోవడం అనేదే...

రమణులు-

మహారాజులు వచ్చి ప్రక్కనే నిలబడినా...

చేస్తున్న పని ఆపలేదు...

పీఠాధిపతులు వచ్చి నమస్కరించినా...

కూర్చోమని ఆసనం చూపలేదు...

నారాయణగురు లాంటి ఆధ్యాత్మికవేత్తలు వచ్చినా...

రాధాకృష్ణన్ లాంటి పండితులు వచ్చినా...

తన మౌనం వీడలేదు...

అలా అని వారిని అవమానించడం కాదు...

ప్రత్యేకత ఇవ్వకపోవడం...

అందరి యెడల ఒకే దృష్టి కలిగి ఉండడం...

అనేవే ప్రధాన ఆకర్షణలుగా అనిపించేవి వచ్చినవారికి...

"ప్రత్యేకత"ను కోల్పోయిన మనసే ఆత్మ...

స్రష్ట(సృష్టికర్త) యొక్క తీర్పు వలననే...

సృష్టి యొక్క తీరు ఉన్నది...

మధ్యలో నీవు దూరి తీర్పు ఇవ్వకు...

ఇదే స్థితప్రజ్ఞుని లక్షణం...

అన్నీ కను...

అన్నీ విను...

తీర్పులేని మనసుతో కను, విను...

ఇదే స్థితప్రజ్ఞుని లక్షణం...

మనుషులే కాదు...

పశుపక్ష్యాదులతో సహా...

దేవతలు సైతం...

నీకు నమస్కరించి వెళుతున్నా సరే...

"ప్రత్యేకత"ను కోల్పోయిన నీ మనసు...

వాటికి చలించదు...ఆనందించదు...

ఇదే స్థితప్రజ్ఞుని లక్షణం...

*******************************

## 91. ప్రేమ

అసలు ఈ ద్వంద్వప్రపంచంలో ప్రేమ ఎక్కడుంది?

ప్రేమే లేనప్పుడు ప్రేమికులు ఎక్కణ్ణుండి వచ్చారు?

ప్రేమ ఉంటే...ద్వేషమూ ఉంటుంది...

ద్వేషాన్ని వ్యతిరేకపదంగా కలిగిన ప్రేమ...

ప్రేమే కాదు...

ఆ ప్రేమ మారువేషంలో ఉన్న ద్వేషమే...

* * *

చాలామందికి ఈ ప్రపంచంలో...

ప్రేమ అనేది ఒక mutual benefit scheme...

అంటారు సద్గురు...

* * *

మానవసంబంధాలన్నీ ఆర్థికసంబంధాలే...

అంటాడు కార్ల్ మార్క్స్...

* * *

ప్రేమ అనగానే పురుషుడికి స్త్రీ...

స్త్రీకి పురుషుడు గుర్తొచ్చినంతకాలం...

వారికి "ప్రేమ" అంటే ఏంటో తెలియనట్లే...

* * *

కామం - శారీరకమైన అవసరం.

అభిమానం - మానసికమైన ఉల్లాసం.

ప్రేమ - ఆధ్యాత్మికమైన ఆనందం.

* * *

ఒక అమ్మాయిగాని, అబ్బాయిగాని...

తనతల్లిదండ్రుల ప్రేమకు మించి మరో పరాయి అబ్బాయి, అమ్మాయి వద్ద నుండి ప్రేమను పొందటం అనేదానిని నేరంగా పరిగణించే కాలం నుండి...

ఏ అబ్బాయీ, ఏ అమ్మాయీ తనను ప్రేమించకపోతే...

తనలో ఏదో దోషముందని అమ్మాయిలు, అబ్బాయిలు అనుకునే కాలంలోకి జారిపడ్డాం...

* * *

వ్యక్తి అంటే Limited.

దేవుడు అంటే Un-Limited.

దేవుణ్ణి ప్రేమించడమంటే మొత్తాన్ని ప్రేమించడం...

వ్యక్తిప్రేమ కాలానికి పరిమితమై ఉంటుంది...

ఇది ఎప్పటికైనా ఖాళీ అయిపోతుంది...

నీ ప్రేమ అనంతమైనప్పుడు...

"ఐ లవ్ యూ" అని ఎవరికీ చెప్పలేవు...

"ప్రేమ"కు అర్థం తెలియనివాడే "ఐ లవ్ యూ" అంటాడు...

ఒక వ్యక్తి వరకే...

లేదా ఒక ప్రాంతం వరకే...

పరిమితమైన ప్రేమ...

స్వార్థపూరితమైనది...

మొత్తపుప్రపంచం నీ కౌగిలిలోకి వచ్చినప్పుడు...

నీవు మహాత్ముడవు...

ఆ "మహాఆత్మ"కు ఎల్లలు లేవు...

అందరిలోకి...అన్నిటిలోకి...

తనను తాను విస్తరింపచేసుకుని...

ఏకత్వానుభూతిని పొందటానికి ఉపయోగపడే...

ఓ దివ్యమైన వాహనం "ప్రేమ"...

* * *

మన అవసరాలను తీర్చిన వ్యక్తుల పట్ల ఉండేది కాసింత కృతజ్ఞత...

తత్ఫలితంగా కలిగేది అభిమానం అంతే...

కానీ అదంతా ప్రేమ అని భ్రమపడతాం...

లౌకిక విషయాల్లో అస్సలు వాడకూడని పదం ప్రేమ...

చివరికి తల్లిప్రేమ కూడా బలహీనతే అంటారు గురువుగారు....

తల్లిప్రేమే బలహీనత అన్నాక...

ఇక మిగతా ప్రేమల సంగతి చెప్పనేల?

ప్రేమించకుండా ఉండలేకపోవడం అనేది వ్యక్తికున్న బలహీనత...

విశ్వాసంగా ఉండలేకపోవడం అనేది కుక్కకున్న బలహీనత...

దానం చేయకుండా ఉండలేకపోవడం అనేది కర్ణుడికున్న బలహీనత...

కానీ లోకంలో-

తల్లిప్రేమ-కుక్కవిశ్వాసం-కర్ణుడిదానం...

ఇవన్నీ గొప్ప విషయాలుగా చరిత్రకెక్కాయి...

* * *

లౌకిక ప్రేమను ప్రేమే అనుకున్నా...

అందులో నాకు తెలిసినంతవరకు గొప్పప్రేమగా అనిపించింది-

అష్టపదులను రచించిన భక్తజయదేవుని భార్యదే ప్రేమంటే...

"జయదేవుడు మరణించాడు..."

అన్న వార్త చెవిన బడగానే...

జయదేవుని భార్య కుప్పకూలి మరణించింది...

లౌకికప్రేమకు ఇంతకంటే గొప్ప నిర్వచనం నాకు కనబడలేదు...

జయదేవుని భార్య...

మాటలు లేకుండా...

నిశ్శబ్దనిర్వచనం ఇచ్చినట్లైంది ప్రేమకు...

* * *

బంధం ఉన్న ప్రేమ - బలహీనత.

బంధం లేని ప్రేమ - భక్తి.

తన తల్లిగారు ప్రాణం విడువగానే...

భోంచేద్దాం పదండి...అన్నారు భగవానులు...

ఏడుపులు లేవు...పెడబొబ్బలు లేవు...

అలా అని రమణులకు ప్రేమ లేదని అనగలమా?

* * *

దేవుణ్ణి ప్రేమించడంలో అంతర్భాగంగా...

నీ తల్లిదండ్రులను...

నీ భార్యాబిడ్డలను...

ప్రేమించాలే తప్ప...

ఆ ప్రేమ వ్యక్తులకు పరిమితమై...

ఓ బలహీనతగా ఉండకూడదు...

తల్లీబిడ్డల ప్రేమ....

యశోదాకృష్ణుల ప్రేమగా తోచినప్పుడు...

అదంతా పవిత్రమే అవుతుంది...

అదంతా భక్తే అవుతుంది...

అదంతా ఉపాసనే అవుతుంది...

అందరిలో దేవుణ్ణి చూడడం - రూపభక్తి...

దేవుడిలో అందరినీ చూడడం - అరూపభక్తి...

* * *

ప్రేమంటే...

ఏ ఒక్కరికో ప్రాముఖ్యత ఇవ్వడం కాదు...

ఏ ఒక్కరి యెడల ప్రత్యేకత కలిగి ఉండడం కాదు....

ప్రేమంటే సంపూర్ణ ఉనికి...

ప్రేమంటే స్వరూపదర్శనం...

* * *

ప్రేమిస్తే అందర్నీ ప్రేమించు...

లేదంటే...

ఎవర్నీ ప్రేమించకు...

రెండూ సమమే...

రెండూ సుఖమే...